ముద్దు విగ్రహం.. ముసురుకున్న వివాదం

- టీడీపీలోనే విమర్శలు
- చెవిలో పూలు పెట్టుకొని వ్యతిరేకించిన టీడీపీ సీనియర్ నేత చలపతి
- తన వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ వీడియో విడుదల
- నగరిలో పుట్టుక, నగరిలో అభివృద్ధి ఆకాంక్షించని వ్యక్తికి విగ్రహమా అంటూ ఆగ్రహం
- పుత్తూరులో మహానాయకుడు ఎన్టీఆర్‌కే ఇప్పటివరకు విగ్రహం లేదని మండిపాటు
- దీంతో పుత్తూరులో ముద్దు విగ్రహంతో పాటు ఎన్టీఆర్ విగ్రహం కూడా హుటాహుటిన ప్రారంభం
- మున్సిపల్ అజెండా, అనుమతులతో సంబంధం లేదా అంటున్న పాలక వర్గ సభ్యులు



పుత్తూరులో ఏర్పాటు చేస్తున్న ముద్దుకృష్ణమనాయుడు విగ్రహం

సాక్షి టాస్క్ ఫోర్స్: నగరి నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో, విజయపురం మండలంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తండ్రి, మాజీ మంత్రి విగ్రహం ఏర్పాటు నియోజకవర్గంలో పలు విమర్శలకు తావిస్తోంది. ఏ కారణంతో పెడుతున్నారో ప్రజలకే బోధపడని పరిస్థితి ఎదురైంది. సొంత పార్టీ నేతలే విగ్రహాల ఏర్పాటును బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారు. నగరి 1వ వార్డుకు చెందిన సీనియర్ టీడీపీ నేత విగ్రహాల ఏర్పాటుపై చెవిలో పువ్వులు పెట్టుకొని విడుదల చేసిన వీడియో మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

సంచలన వీడియో

వీడియోలో ఆయన మాట్లాడుతూ నగరి మొదటి ఎమ్మెల్యే వరదాచారి నుంచి 18 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారన్నారు. ఎవరికీ విగ్రహాలు పెట్టలేదన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి ఎన్టీఆర్, అలాగే పేదలందరూ అయ్యా అంటూ చేతులెత్తి నమస్కరించిన వ్యక్తి వైఎస్ఆర్, దళిత జీవితాల్లో వెలుగు నింపిన అంబేడ్కర్ వీరికి విగ్రహం పెడితే అది సమంజసనీయమన్నారు. నగరికి గుర్తింపు అయిన టవర్ క్లాక్ పక్కన కొత్తగా విగ్రహం ఏ కారణంతో పెడుతున్నారంటూ ముద్దుకృష్ణమ విగ్రహం ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. రాజకీయం అనే అస్త్రాన్ని అడ్డం పెట్టుకొని విగ్రహాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదంటూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నగరిలో పుట్టని వాళ్లు, నగరి అభివృద్ధిని ఆకాంక్షించని వారికి విగ్రహాలెందుకన్నారు. వారేమైనా స్వాతంత్ర్య సమరం, ఆపరేషన్ కార్గిల్‌లో పాల్గొన్నారా అంటూ ప్రశ్నించారు. ఏ పార్టీని అడ్డు పెట్టుకొని గెలిచారో ఆ పార్టీని స్థాపించిన ఎన్టీఆర్‌కు పుత్తూరులో ఇప్పటివరకు విగ్రహం లేదన్నారు. ప్రస్తుతం పెట్టే విగ్రహం స్వార్థం కోసం పెడుతున్నదే అన్నారు. నగరికి పాఠశాలకు, పోలీస్ స్టేషన్‌కు, క్రీడా మైదానానికి స్థలాన్ని ఇచ్చిన పాలేగారు చెంగమనాయుడుకు విగ్రహం పెట్టొచ్చని, బాలికల పాఠశాలకు స్వంత స్థలాన్ని ఇచ్చి బాలికల చదువుకు పునాది వేసిన



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ముద్దుకృష్ణమ నాయుడు, ఎన్టీఆర్ విగ్రహం

సూరా గోవిందరాజులు నాయుడుకు విగ్రహం పెట్టొచ్చని తెలిపారు. పేదలకు వైద్యం అందాలని సీఎస్ఐ ఆస్పత్రికి స్థలాన్ని ఇచ్చిన ఆనం కన్నయ్య నాయుడుకు విగ్రహం పెట్టొచ్చని, నగరిలో పార్కును ఏర్పాటు చేసి, శ్మశానాన్ని బాగు చేసిన రోజాకు విగ్రహం పెట్టినా అర్థం ఉంటుందన్నారు. నగరి అభివృద్ధి ఆకాంక్షించని వారికి విగ్రహం



చెవిలో పువ్వులు పెట్టుకొని వీడియోలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత చలపతి

ఏర్పాటు ఎందుకో గుండెలపై చేతులేసి చెప్పాలన్నారు. అభిమానముంటే వారి ఇంటి వద్ద పెట్టుకోవాలని, లేకుంటే విద్యాసంస్థల్లో పెట్టుకోవాలన్నారు. నగరి నడిబొడ్డు నగరి ప్రజల సొత్తు అని అక్కడ ఇష్టానుసారం విగ్రహం పెట్టడాన్ని ఎవరూ ఒప్పుకోరన్నారు. సుప్రీంకోర్టుకు వెళ్లైనా ఈ అంశంపై పోరాడుతానన్నారు. విగ్రహాల ఏర్పాటులో ఆంతర్యమేమిటో ఆలోచించాలంటూ ఘాటుగా పలికిన వీడియో వైరల్ అయింది.

పుత్తూరులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు

వీడియోటేప్ వైరల్ కావడంతో పుత్తూరులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థానిక టీడీపీ నేతలు పూనుకున్నారు. ముద్దుకృష్ణమనాయుడు 79వ జయంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ విగ్రహం కూడా ప్రారంభించే సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ విగ్రహాల ఏర్పాటుకు నిబంధనల మేరకు తీసుకోవాల్సిన అనుమతులు ఏవీ తీసుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీగా ఉంటే మున్సిపల్ అజెండా, అనుమతులతో సంబంధం లేదా అంటూ పాలక వర్గ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక



షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కార్వేటినగరం: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కత్తెరపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఆ స్కూల్ హెచ్ఎం చెంగల్‌రాజు అన్నారు. షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను ఆదివారం హెచ్ఎం, టీచర్లు అభినందించారు. తమ స్కూల్ నుంచి ఎం.ప్రశాంత్ (576), టీ.చిన్ని(546), ఈ. ద్యాని (518) మార్కులు సాధించి అవార్డుకు ఎంపికయ్యారని, జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో అవార్డులు స్వీకరిస్తారని హెచ్ఎం చెప్పారు. రూ.20 వేల నగదు, సర్టిఫికెట్, మెడల్స్ అందుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చలపతిరావు, సుజల, మోహన్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు ఉద్యోగ విరమణ సన్మానం



లలితకుమారిని సన్మానిస్తున్న మోహన్ మురళి

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి ఉద్యోగ విరమణ పొందారు. ఆదివారం ఆమెకు పెరుమాళ్లపల్లె మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌మురళితో పాటు పలువురు నాయకులు వీడ్కోలు సన్మానం చేశారు. ఆమె సేవలను ప్రస్తుతించారు.

తెప్పపై సుందరరాజస్వామి విహారం

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం సాయంత్రం పుష్కరిణిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీసుందరరాజ స్వామి తెప్పపై విహరిస్తూ భక్తులకు దివ్యానుగ్రహం ప్రసాదించారు. మధ్యాహ్నం 3గంటలకు ఉభయదేవేరులతో కలిసి స్వామివారిని సన్నిధి ముఖమండపానికి తీసుకొచ్చారు. అనంతరం వేదపారాయణం, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు సర్వాంగ శోభితుడైన స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా తెప్పపై కొలువై మూడు పర్యాయాలు పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం స్వామివారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

తెప్పోత్సవాల్లో నేడు..

తెప్పోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు పుష్కరిణి మధ్యలో ఉన్న నీరాడ మండపంలో శ్రీపద్మావతి అమ్మవారికి అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు తెప్పోత్సవం, రాత్రి 7.30 గంటలకు తిరుచ్చి ఉత్సవం జరుగుతుంది.

బావ బామ్మర్ది ఘర్షణ



గాయపడిన మధురెడ్డి

శ్రీరంగరాజపురం: బావ బామ్మర్దికి ఆర్థిక లావాదేవీల కారణంగా ఘర్షణ పడటంతో ఒకరికి చిటికెను వేలుకు తీవ్రగాయమైన సంఘటన మండలంలోని నల్లాపల్లెలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. బుజ్జిరెడ్డి, మధురెడ్డి ఇద్దరు బావ బామ్మర్దులు. కొన్ని రోజులుగా ఇద్దరికి ఆర్థిక లావాదేవీల కారణంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మధురెడ్డి డబ్బులను ఇవ్వాలని బుజ్జిరెడ్డి అడగడంతో మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. బుజ్జిరెడ్డి చాకుతో దాడి చేయడంతో మధురెడ్డి చిటికెన వేలుకు తీవ్ర గాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవం.. సాంస్కృతిక సంబరం



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైకి చెందిన శక్తిలయ నాట్యపల్లి ఆధ్వర్యంలో నాట్యాచార్యులు సతియ ఆనంద రెడ్డి పర్యవేక్షణలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.



కేశ ఖండన కార్యక్రమంలో నాయకులతో మాజీ మంత్రి ఆర్కే రోజా

తిరునాళ్లలో అన్నదానం



తిరునాళ్లలో అన్నదానం చేస్తున్న ఆర్కే రోజా

పుత్తూరు: పుత్తూరు మున్సిపాలిటి 10వ వార్డు కామరాజునగర్‌లో ఆదివారం జరిగిన అంకాల పరమేశ్వరి తిరునాళ్లలో మాజీ మంత్రి ఆర్కే రోజా అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం తన చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆమెకు ఆలయ మర్యాదలు చేసి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు గోపాలకృష్ణాపురం పంచాయతీ పైడిపల్లెలో మండల పరిషత్ కో–ఆప్షన్ మెంబర్ రాంబత్తయ్య మనువరాలు కేశఖండన కార్యక్రమంలో ఆమె చిన్నారిని ఆశీర్వదించారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రప్రభపై గోవిందుడి వైభవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై వెన్నకృష్ణుడి అలంకరణలో కొలువై ఊరేగుతూ శ్రీగోవిందరాజ స్వామి భక్తులను కనువిందు చేశారు. స్వామివారి చంద్రప్రభ వాహన సేవ కోలాహలంగా సాగింది. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారు సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

గరుడ వారధిపై వసూళ్ల దందా

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక ప్రాంతమైన తిరుపతి నగరంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తెలిసిందే. దీంతో గత వైఎస్సార్‌సీపీ సర్కార్‌లో శ్రీనివాస వారధి పేరుతో నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు వాహనదారులకు అందుబాటులోకి వారధిని తీసుకొచ్చారు. దీంతో ప్రధానంగా లక్ష్మీపురం సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, లీలామహల్ సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గరుడ వారధిగా పేరు మార్పు చేశారు. అయితే ఆర్టీసీ బస్టాండ్‌లోకి పొరబాటున వారధిపై నుంచి కార్లు, ఇతర వాహనాలు వెళ్తే వారికి ఇష్టారాజ్యంగా జరిమానా విధిస్తున్నారు.

నెల్లేపల్లెలో అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన వధ ఘట్ట ప్రదర్శన



శ్రీరంగరాజపురం: భీమ దుర్యోధనుడి యుద్ధ సన్నివేశం

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లెలో 18 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ ఘట్టంతో ముగిశాయి. భీముని పాత్రలో అశోక్, దుర్యోధని పాత్రలో కిరణ్ రక్తి కట్టించారు. గంగ మడుగులో దాక్కున్న దుర్యోధునుడిని వెలుపలికి రప్పించే వధ ఘట్టంలో పాత్రలిద్దరూ కలియబడితూ పద్యాలతో ఆకట్టుకున్నారు. సాయంత్రం కంకణధారులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. పెద్ద మిట్టపల్లెకు చెందిన దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రసాద్ రెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకట రెడ్డి, గంగయ్య, యుగంధర్ రెడ్డి, దేవరాజుల నాయుడు, పట్టాభి రెడ్డి, సుధాకర్ రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు .

చిల్లమాకులపల్లెలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని చిల్లమాకులపల్లె పాయికట్టు వద్ద శ్రీ ద్రౌపదీ ధర్మరాజులు ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక మహాభారతం ఉత్సవం బ్రహ్మోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధన ఘట్టం భక్తులను అలరించింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం హరికథ కాలక్షేపం అనంతరం దుర్యోధన ఘట్టం ప్రదర్శించారు. దుర్యోధనుడిని భీమసేనుడు గంగమడుగు నుంచి వెలుపలికి రప్పించే వధించే ఘట్ట ప్రదర్శనను కళాకారులు రక్తి కట్టించారు. ఆ తర్వాత. ధర్మరాజుకు పట్టాభిషేకం చేశారు. కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. దీనికి ఉభయదారులుగా ముద్దుకుప్ప సర్పంచ్ శీనయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త లోకనాథరెడ్డి, నిర్వహకులు నారాయణరెడ్డి, చిరంజీవిరెడ్డి, సతీష్, గురుస్వామి రెడ్డి, సుబ్రమణ్యం, కృష్ణయ్య, సర్పంచులు విజయ, చిట్టి, అనిత, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సతీమణి మృతి

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆస్థాన విద్వాంసుడు దివంగత గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సతీమణి గరిమెళ్ల రాధ అనారోగ్యంతో భవానగర్‌లోని వారి స్వగృహంలో ఆదివారం ఉదయం 8.15 గంటలకు మృతి చెందారు. ఆమె భర్త గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గత మూడు నెలల క్రితం వైకుంఠ ప్రాప్తి చెందిన విషయం విదితమే.

వైభవంగా వాహన సేవలు



చిన్న శేష వాహనంపై శ్రీవారు

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారు ఆదివారం చిన్నశేష, హంస వాహనాలపై విహరించారు. అప్పలాయగుంట గ్రామంలో వృద్ధుడు మృతి చెందడంతో ఆదివారం ఉదయం ఆలయాన్ని తెరవలేదు. దహన క్రియలు పూర్తయిన తరువాత ఆలయాన్ని శుద్ధి చేసి, ఆలయాన్ని గ్రామాన్ని సంప్రోక్షణ చేసి సాయంత్రం 5గంటలకు చిన్నశేష వాహనంపై శ్రీవారిని మాడ వీధులలో కాకుండా ఆలయం చుట్టూ ఊరేగించారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు భక్తి కీర్తనల ఆలాపనల నడుమ ఊంజల్ సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వాహన మండపానికి చేరుకున్న శ్రీవారు అలంకరించిన హంస వాహనం అధిరోహించి పుర వీధులలో విహరించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు, నారికేళాలు సమర్పిస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయాధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారచార్యులు, కంకణభట్టర్ తిప్పయాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



హంస వాహనంపై స్వామివారు

గ్రావెల్ పేరిట గుట్ట స్వాహా!

- రోజూ వందలాది టిప్పర్లలో తరలింపు
- మాజీ డిప్యూటీ సీఎం దృష్టికి నివేదించిన మండల నాయకులు, ప్రజలు



తమిళనాడుకు ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్లు

పాలసముద్రం: మండలంలో ఎన్నడూ లేని విధంగా బలిజకండ్రిగ, తొట్టిండ్రిగ సమీపంలోని గుట్టలో గ్రావెల్ పేరుతో ఎర్రమట్టిని రోజుకి వందలాది టిప్పర్ల లోడ్లను తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నారని ఆదివారం వైఎస్ఆర్ సీపీ నాయకులు, ప్రజలు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టిప్పర్లలో యథేచ్ఛగా ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తే టీడీపీ నాయకులు కేసులు బనాయిస్తామని బెదిరింపులకు దిగుతున్నారని, మరోవైపు పోలీస్, రెవెన్యూ యంత్రాంగం దీనిపై చోద్యం చూస్తోందని విమర్శించారు. ఒక టిప్పర్‌లో సుమారు 40 టన్నుల మట్టి.. ఇలా రోజుకి 100 పైగా టిప్పర్లలో తమిళనాడు రాష్ట్రానికి అక్రమ రవాణా చేస్తున్నా ఏ చర్యలూ తీసుకోవడం లేదని, అధికారులు దాసోహమయ్యారా? అని ప్రశ్నించారు. ఇలా ఎమ్మెల్యే థామస్ గుట్టలోని మట్టిని అనుమతి లేకుండా తమిళనాడు, ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటే, మండలంలోని టీడీపీ నాయకులు ఇసుకను తమిళనాడుకి రాత్రి పూట తరలిస్తున్నారని, ఈ అక్రమ రవాణాపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అంతేకాకుండా టీడీపీ నాయకులు యథేచ్ఛగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా పట్టించుకోకుండా ఎక్సైజ్ శాఖ నిద్రమత్తులో జోగుతోందని మండిపడ్డారు.



అమ్మవారికి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

శ్రీరంగరాజపురం: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజుల వార్షిక మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదీ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా కాలక్షేపం అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవ మూర్తులను వేంచేపు చేశారు. పట్టు పీతాంబరాలు, సుగంధ పరిమళ భరిత పుష్పాలతో ముస్తాబు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా ఎత్తిరాజులునాయుడు, కుమారి, ప్రకాష్, స్వాతి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

అలరించిన బలి బండి కుంభాలు



బలికూడుతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలో పచ్చికాపల్లంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బలి బండి కుంభాల కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా కాలక్షేపం అనంతరం సాయంత్రం బకాసురుని వేషధారి బలికూడుతో అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేసి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు బలికూడుతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బాణసంచా పెద్ద ఎత్తున పేల్చి యువత సందడి చేసింది. సోమవారం అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



భక్తుల సందడి

నేత్ర పర్వం.. ద్రౌపదీ కల్యాణం



విశేష అలంకరణలో ద్రౌపదీ ధర్మరాజులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంటలో నిర్వహిస్తున్న మహా భారత వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదీ, ధర్మరాజుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. మొక్కులున్న భక్తులు అమ్మవారికి వడిబాల, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్ద కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ వేద పండితులు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. కల్యాణోత్సవంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. వారికి ప్రసాదం, సారెను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు, ధర్మకర్తలు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.